


కలెక్టర్‌ను కలిసిన డిఎంసిఎస్

పార్వతీపురం: పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఐ.రాజేశ్వరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ ఛాంబరులో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇప్పటి వరకు జిల్లా మేనేజర్‌గా కొనసాగిన పి.శ్రీనివాసరావు స్థానంలో ఆమె ఉద్యోగోన్నతిపై నియమించబడ్డారు.



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న డిఎంసిఎస్

నిండా మునిగిన మొక్కజొన్న రైతు

•విత్తన కంపెనీల నిర్వాకమే కారణం
•దిగుబడి తగ్గి నష్టాల పాలు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఈ ఏడాది రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నిండా మునిగిపోయారు. మండలంలోని ప్రతి గ్రామంలో మొక్కజొన్న కంపెనీలు ఏజెంట్లను పెట్టుకొని మొక్కజొన్న సాగుకు నోటి మాట ద్వారా ఒప్పందాలను చేసుకొని రైతులు సాగు చేశారు. మొక్క జొన్న వెన్ను కట్టే సమయానికి గింజ కట్టకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రతి మొక్కజొన్న కంపెనీ ప్రతినిధులు గ్రామాల్లోని రైతుల వద్ద వచ్చి తమ కంపెనీ విత్తనాలను వేయండి, వేసినాక పంట పండకపోతే ఒప్పందాలు ప్రకారం ప్రతి ఒక్కరికీ ఎకరాకు మూడు టన్నులు చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి దిగుబడి బాగా తగ్గి తీవ్రమైన నష్టాలు పాలవుతున్నారు.

మండలంలో సుమారు 4,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ఈ పంట సాగుకు రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా ఎక్కువే అయ్యింది. వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలు వేయడంతో పెట్టుబడులు పెరిగి, దిగుబడి తగ్గడంతో రైతులు నష్టాలకు గురవుతున్నారు. విత్తన కంపెనీలు ఇచ్చే విత్తనాలు నాటి లాభం పొందవచ్చునన్న ఆశతో రైతులు ఈ పంటపై ఎక్కువగా మొగ్గుచూపారు. తీరా అవి మంచి విత్తనాలు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



ఎకరాకు సుమారు రూ.15వేలు వరకు పెట్టుబడి పెట్టి కంపెనీ వారు చెప్పిన ఎరువులు, పురుగు మందులను క్రమం తప్పకుండా వేసినా దిగుబడి రాకపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు.

కంపెనీ ప్రతినిధులు, ఏజెంట్లు మోసం

నూజివీడు, కావేరి, బయో, బేయర్, సిపి, హైటెక్ మొదలైన కంపెనీ ప్రతినిధులు ఈ ప్రాంతంలో రైతుల వద్దకు వచ్చి తమ విత్తనాలు వేస్తే మంచి దిగుబడి వస్తుందని నమ్మబలికారు. ఎకరాకు మూడు టన్నులు వరకు పంట వస్తుందని, అలా మూడు టన్నులకు ఎవరికైనా దిగుబడి తక్కువైతే వారికి నష్టపరిహారం, వారు పండించిన పంట పోను మిగతా ఎంతుంటే అంత చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు రైతులకు చెప్పారు. ఎకరానికి రూ.20 వేలు వరకు పెట్టుబడి కోసం కొందరు రైతులకు అందించి మిగతా మొత్తాన్ని పంట చేతికొచ్చాక చెల్లిస్తామని తెలిపారు.తీరా పంట ఇప్పుడు చేతికి వచ్చే సమయానికి దిగుబడి రాకపోవడంతో మీరు చెప్పిన మాట ప్రకారం మిగతా నష్టపరిహారాన్ని ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడంలేదు. అంతేకాక తాము చెప్పిన విధంగా ఎరువులు, పురుగుల మందులు వేయలేదని, సమయానికి నీరు అందించలేదని, మీ భూమిలో సారం లేదని రకరకాల కారణాలు చెప్పి తప్పించుకు తిరుగుతున్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని గ్రామాల్లో ఉన్న ఏజెంట్లను అడిగితే వారంతా కంపెనీ ప్రతినిధులకు వత్తాసు పలుకుతున్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు కూడా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి



నాకు ఉన్న ఎకరా పొలంలో మొక్కజొన్న విత్తనాలు నాటాను. దాని ద్వారా కంపెనీ ప్రతినిధులు చెప్పిన విధంగా మూడు టన్నులు రావాలి. కానీ నాకు 900 కేజీలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఇదే విషయం కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తే నష్టపరిహారాన్ని చూస్తాం... చేస్తామని చెప్పడమే కానీ ఆచరణలో ఇవ్వడం లేదు.

డొంక వెంకటరావు, రైతు, మామిడిపల్లి.

వ్యవసాయాధికారులు పట్టించుకోవడంలేదు



మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఏటా నష్టపోతున్నా వ్యవసాయ శాఖా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. నాకున్న మూడు ఎకరాల్లో నూజివీడు అనే రకం మొక్కజొన్న విత్తనాన్ని వేశాను. 9 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 4 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. కంపెనీ ప్రతినిధులు చెప్పినట్లు మిగతా పంట నష్టాన్ని ఎవరు భరిస్తారు.

డొంక వాసు, రైతు, మామిడిపల్లి.



చర్చల్లో మాట్లాడుతున్న గ్రామస్తులు, నాయకులు, అధికారులు

చర్చలు విఫలం

కందకాల పనులు చేపట్టొద్దు

అటవీశాఖ అధికారులకు తేల్చిచెప్పిన ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, ప్రజలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులతో అటవీశాఖ అధికారులు గురువారం చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. ఎలిఫెంట్ జోన్ కోసం చేపడుతున్న ట్రెంచ్ పనుల వల్ల తమకు నష్టమని ప్రజలు అడ్డుకున్నారు. పనులు అడ్డుకోవద్దని, ప్రజలకు ఏమైనా అనుమానాలుంటే నివృత్తి చేస్తామని అటవీ అధికారులు చెప్పారు. దీంతో బుధవారం స్థానిక అటవీ రేంజ్ అధికారి కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో భూములు సాగు చేస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అటవీ రేంజ్ అధికారి చెప్పారు. అయితే ఈ విషయాన్ని గ్రామస్తుల సమక్షంలో చెప్పాలని, వారు అంగీకరిస్తే అభ్యంతరం లేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మండలంలోని అప్పయ్యపేటలో ఫారెస్ట్ అధికారులు అప్పయ్య పేట, గుచ్చిమి, తాన సీతారాంపురం, చిన్నరాయుడుపేట, రేపటివలస, తామరఖండి గ్రామాల ప్రజలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం రేంజ్ అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ చుట్టుపక్కల సాగు చేసుకుంటున్న పేదల భూముల జోలికి వెళ్లమని, సాగునకు ఎటువంటి ఆటంకం కలిగించబోమని, యథావిధిగా మీరు మీ భూముల్లో కొనసాగవచ్చు తెలిపారు. అయితే కుంకీ ఏనుగులను తెచ్చి మచ్చిక చేసే ఏర్పాట్లు ఇక్కడే కొనసాగుతాయని, కందకాలు పనులు కూడా కొనసాగుతాయని చెప్పడంతో ప్రజలు ఇందుకు అంగీకరించలేదు. దీంతో చర్చలు విఫలమయ్యాయి. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఎం,కృష్ణ మూర్తి, రెడ్డి వేణు (సిపిఎం), పి.శ్రీను నాయుడు (రైతు కూలీసంఘం), కె.మన్మథరావు, భాస్కరరావు, కుమార్ (సిపిఐ), స్థానిక ఎంపిటిసి సభ్యులు బురిడి సూర్యనారాయణ, సీతానగరం మండల సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గార వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఐద్వా ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఇంటింటికి కుళాయి మంజూరు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ నగర పంచాయతీగా మారి సుమారు 12ఏళ్లు కావస్తుందన్నా పాలకొండ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. పట్టణం రోజు రోజుకు విస్తరిస్తునందని, సుమారు 285 వీధుల్లో సుమారు 38 వేల జనాభా ఉన్నారన్నారు. అయితే వీరికి నేటికీ కనీస మౌలిక సదుపాయాల్లేవన్నారు. తాగునీరు సమస్యతో పాటు మురికి కాలువలు, రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక మనిషికి 60 లీటర్లు నీరు కావాల్సి ఉండగా, పట్టణ మొత్తం జనాభాకు 20 లక్షల లీటర్లు కంటే ఎక్కువ తాగునీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. అయితే కేవలం 8 లక్షల లీటర్ల మాత్రమే సరఫరా చేస్తున్నారన్నారు. కావున తక్షణమే పట్టణ ప్రజలకు సరిపడా తాగునీరిందించి సమస్యలను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ఇంటి పన్నులు అధికంగా ఇక్కడే వసూలు చేస్తున్నారని, అయినా కనీసం తాగడానికి మాత్రం సరిపడా నీరివ్వడంలేదని విమర్శించారు. శివారు ప్రాంతాలకు పూర్తిగా నీరందడం లేదన్నారు. ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యలు పరిష్కారానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని గారమ్మ కాలనీ, రెల్లి వీధి మహిళలు తాగునీటి సమస్య వెంటనే పరిష్కరించాలని, లేకుంటే కుటుంబాలతో వచ్చి కార్యాలయం ముందు బైఠాయిస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ టి.జయరాంకు వినతి పత్రం అందజేశారు. పిన్నింటి రాధా, ఇ.భవాని, సునీత, పి.శకుంతల, పి.దాలప్పమ్మ, కె.పద్మ, వి.ఝాన్సీ, గౌరమ్మ, ఎం.పద్మ తదితరులు నాయకత్వం వహించిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, అధ్యక్షులు బి.వాణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు సంఘీభావం తెలిపారు.

పల్లెపండగ పనులన్నీ పూర్తికావాలి

ఐదు రోజుల్లోగా బిల్లులు అప్‌లోడ్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పల్లె పండుగ కింద చేపట్టిన పనులన్నీ రానున్న ఐదు రోజుల్లోగా శత శాతం పూర్తికావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పల్లె పండుగ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ముఖ్యంగా ఫార్మ్‌పాండ్స్, ప్రహరీ గోడలు, మినీ గోకులాలు, రహదారులపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. కావున ఈనెల 25 నాటికి ఎన్ని పనులు చేయగలిగితే అన్ని పూర్తిచేయాలని తెలిపారు. పనులు వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పులు చేయరాదని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఐటిడిఎ, పిఐయు ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా పది రోజులే గడువు ఉన్నప్పటికీ బిల్లులు సమర్పించేందుకు ఐదు రోజులు మాత్రమే గడువు ఉందని, కావున ఈలోగా పనులన్నీ పూర్తి కావాలని అన్నారు. పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారుల అభీష్టం మేరకు లక్ష్యాలను నిర్దేశించామని, అయినప్పటికీ ఇప్పటి వరకు 40 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన 60 శాతం పనులు పురోగతిలో ఉన్నందున ప్రతి రోజు ప్రగతి కనబర్చాలని, నిర్లక్ష్యం వహించిన ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు. ఫార్మ్ పండ్స్, ప్రహరీగోడలు, మినీ గోకులాలు, రహదారులు జిల్లాలో ఆవశ్యకమని, కావున వీలైనంత త్వరగా వాటిని పూర్తిచేసి ఈనెల 25 నాటికి అప్పటి వరకు జరిగిన పనులకు బడ్జెట్ బుక్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫార్మ్ పాండ్స్‌పై ఎంపిడిఒలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డి.చంద్రశేఖర్, సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి రమాదేవి, పాలకొండ ఇంజనీరింగ్ అధికారి జి.రవి, పంచాయతీరాజ్ సాంకేతిక సలహాదారుడు ఎంవిజి కృష్ణాజీ, డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన జీడిపప్పు కొనుగోలు చేయాలి

వన్ ధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకె) సభ్యులు జిల్లాలో నెలకొల్పే జీడి పరిశ్రమలకు నాణ్యమైన జీడిపప్పును రైతుల నుంచి కొనుగోలు చేసుకొనేలా సహకారం అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే జీడి పప్పును ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది 300 మెట్రిక్ టన్నుల జీడి పప్పు వీడివికెల లక్ష్యం కావాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.. స్వయంగా జీడి పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని క్రయ, విక్రయాలు జరుపుకునేలా విడివికెల సభ్యుల తీర్మానం తప్పనిసరి అని కలెక్టర్ గుర్తు చేశారు. ఏప్రిల్ 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తికావాలని తేల్చి చెప్పారు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్లు, ఎపిఎంలు, ఉద్యాన శాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రయ విక్రయాలు, స్టోరేజ్ తదితర వాటికి చెందిన రికార్డులు పక్కాగా నిర్వహించుకునేలా ఇద్దరు విడివికె సభ్యులకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. అలాగే క్రయ, విక్రయాలు జరిపే సమయంలో సాధారణ, గ్రేడ్- ఎ రకాల ధరలను తెలియజేసే పట్టికను అందరికీ కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విడివికెలు పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు అవసరమయ్యే బ్యాంకు ఖాతా, జిఎస్‌టి, లైసెన్స్, విద్యుత్ - నీటి సదుపాయాలు, వెంటిలేషన్, రానూ - పోనూ మార్గాలు, ఇతర ప్రాసెసింగ్ తదితర చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, వెలుగు ప్రాజెక్ట్ అధికారి వై.సత్యంనాయుడు, ఎపిఎంలు, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

నాటుసారా విక్రయాలు చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ప్రొసిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌విఎన్ బాబ్జీరావు హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరిపల్లిలో గ్రామస్తులకు నాటుసారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకు కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. నాటుసారా తయారీ, విక్రయాలు బదులుగా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని, జీవనోపాధి మెరుగ పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా సూపరింటెండెంట్ శ్రీనాథుడు, ఎఇఎస్ జీవన్ కిశోర్, సిఐ జి.దాసు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని తాళ్లబురిడిలో నవోదయం 2.0 భాగంగా సారారహిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, సూపరింటెండెంట్ శ్రీనాథుడు, పార్వతీపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. సారా జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో నాటుసారా లేకుండా చేయడంలో సహాయ సహకారాలు అందిస్తామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.



మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిసి బాబ్జీరావు

అపారిశుధ్యంలో అంపావల్లి

మెరుగుపర్చాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని అంపావల్లి గ్రామంలో తాండవిస్తున్న అపారిశుధ్యంను సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆ గ్రామంలో పర్యటించిన సిపిఎం బృందం అపారిశుధ్యం అధ్వాన్నంగా ఉన్న విషయాన్ని గుర్తించి స్థానిక సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రెడ్డి వేణు, మన్మథరావు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ చూసినా కాలువలలో పూడికలు పేరుకుపోయి ఉన్నాయని, అపారిశుధ్యం గ్రామంలో తాండివిస్తోందని చెప్పారు. ముఖ్యంగా దళిత వాడల్లో పేరుకుపోయిన చెత్త వల్ల దోమలు పెరిగి దీర్ఘకాలిక వ్యాధులు భారిన పడే ప్రమాదం ఉందని ఇది కేవలం స్థానిక అధికారుల, నాయకుల నిర్లక్ష్యం వల్ల జరిగిందేని మండిపడ్డారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, శాఖ కార్యదర్శి ఆవు సాంబమూర్తి, మండల నాయకులు యమ్మల మన్మధరావు పార్టీ సభ్యులు గ్రామాలలో ప్రజల దగ్గరకు వెళ్లి వివిధ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త తీయకపోవడంతో దోమలు దాడి చేసి మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వీరి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులు స్పందించి కాలువల్లో పూడికలను తీయించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా సూపర్ సిక్స్ అమలు చేయలేదని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. రైతులకు రైతు భరోసా, పిల్లలకు అమ్మఒడి, ఉద్యోగులకు డిఎస్‌సి లాంటి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉచిత బస్సు సౌకర్యం లేదు, ఉచిత గ్యాస్ డబ్బులు సక్రంగా పడలేదు, 18 సంవత్సరాల నిండిన ఆడపడుచులకు ఇస్తామన్న నెల 1500 ఊసే లేదనీ వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలని కాలువలో పూడికలను తీయించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరినాయుడు, విశ్వేశ్వరరావు, శివరాం, గణపతి, సత్యం, సన్యాసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అంపావల్లిలో నెలకొన్న చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అగ్నివీర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి ఎ.సోమేశ్వరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి ఎ.సోమేశ్వరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత సైన్యం లో అగ్నివీర్ ఉద్యోగాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 10 వరకు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వారి అడ్మిట్ కార్డును డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా ఆర్మీ ర్యాలీ తేదీ, సమయం పొందగలరని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా యువత ఆన్‌లైన్ పరీక్ష పాసైన వారికి ఆర్మీ ర్యాలీ (ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్) నిర్వహిస్తామన్నారు. అగ్నివీర్‌లో జనరల్ ఉద్యోగానికి పదో తరగతి పాసై కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అగ్నివీర్ టెక్నికల్ ఉద్యోగానికి ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు ప్రతి సబ్జెక్టులో కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులతో కనీసం 50 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు.

అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ ఉద్యోగానికి ఇంటర్మీడియట్‌లో టెక్నికల్ ఆర్ట్స్, కామర్స్, సైన్స్ సబ్జక్టులతో కనీసం 60 శాతం మార్కులు, ప్రతి సబ్జెక్టులో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అగ్ని వీర్ ట్రేడ్స్ మెన్ ఉద్యోగాలకు 8, 10వ తరగతి పాసై ఉండాలని అన్నారు. అభ్యర్థులు అక్టోబర్ 2004 నుంచి ఏప్రిల్ 2008 మధ్య జన్మించి ఉండాలన్నారు.

శరీర కొలతలు : ఎత్తు : అగ్ని వీర్ జనరల్ డ్యూటీ, ట్రేడ్స్ మెన్ అభ్యర్థులు 166 సెంటీ మీటర్ల ఎత్తు కలిగివుండాలని, అగ్నివీర్ టెక్నికల్ అభ్యర్థులు 165 సెంటీ మీటర్ల ఎత్తు కలిగివుండాలని, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్, టెక్నికల్ అభ్యర్థులు 162 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని సూచించారు. ఛాతి 77 సెంటీమీటర్లు, ఊపిరి పీల్చినప్పుడు 5 సెంటీమీటర్ల విస్తీర్ణం పెరగాలన్నారు. ఎత్తుకు తగిన బరువు కలిగి ఉండాలన్నారు.

ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్ల షార్ట్ టర్మ్ సర్వీస్ ద్వారా అగ్నివీర్ ఉద్యోగానికి తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్ ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఆర్మీ ఆధ్వర్యంలో జరుగుతుందని, అభ్యర్థులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆసక్తి గల పార్వతీపురం మన్యం జిల్లా యువ అభ్యర్థులు ఇండియన్ ఆర్మీలో చేరేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయపు పనివేళలో సెట్విజ్ మేనేజరు కాగాన వెంకట రమణ, ఫోన్ నెంబర్ 9849913080 కు సంప్రదించవచ్చని అన్నారు.

మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం చర్చి వీధిలో గల డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఈ పార్కును పరిశీలించి, పార్కులో సౌకర్యాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్కులో సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయని, పిల్లలు ఆడుకునే, వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. మౌలిక సదుపాయాల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచారని, తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా లేదని అన్నారు. ప్రతిరోజూ అనేక మంది మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇపార్క్‌ను వినియోగించుకుంటున్నారని, కానీ సౌకర్యాలు అంతంత మాత్రమేనని అన్నారు. మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పార్కు పర్యవేక్షణ సిబ్బందిని నియమించాలని కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించారు. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ చెప్పారు. తన కుమారుడు కొమ్మినేని కిషోర్ కుమార్ జ్ఞాపకార్థం ఈ నెల 21న ప్రథమ స్థానానికి రూ.5వేలు, ద్వితీయానికి రూ.3వేలు, తృతీయానికి రూ.2వేలు చొప్పున విద్యార్థులకు అందించారని మొత్తం రూ.10వేలును పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి గురువారం ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి అందించారు.

ఎయిడెడ్ పాఠశాలలను పున ప్రారంభించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఎయిడెడ్ పాఠశాలలను పున ప్రారంభించాలని మంత్రి నారా లోకేష్‌కు ఉపాధ్యాయులు సన్యాసినాయుడు, భగవాన్ వినతి పత్రం అందించారు. బొద్దిడి, దుమ్మంగి, పి.ఆమిటి గ్రామాల్లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలు ఉపాధ్యాయులు లేక పూర్తిగా మూతపడ్డాయని దీంతో స్థానికంగా ఉన్న విద్యార్థులు చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుందని విన్నవించారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సిఫారసు మేరకు ఉపాధ్యాయులు సమస్యను మంత్రి లోకేష్‌కు వివరించారు.

ఏనుగులను తరలించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిశా నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులను అడవికైనా, జూకైనా తరలించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. రోజురోజుకు ఏనుగుల వల్ల నష్టపోతున్న రైతులను ఉద్దేశిస్తూ మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2017లో ఒడిశా నుంచి వచ్చిన ఏనుగుల వల్ల ఇప్పటి వరకూ 12మంది మృతి చెందగా, రూ.6కోట్ల వరకు పంట, ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఏనుగులను తరలించాలని ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో అనేక విధాలుగా ఆందోళన జరిగినా పాలకులు నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కుంకీ ఏనుగులను ఇస్తామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ వాటిని పంపించడం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఏనుగులను అడవికైనా, జూకైనా, ఒడిశాకు పంపించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు ప్రసాదు రాము సుబ్బారావు పాల్గొన్నారు.

తోటపల్లి పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఆధునీకరణ పనులను గత ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, కూటమి ప్రభుత్వమైనా తక్షణమే పనులు పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన తోటపల్లి ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో ఆరు శాతమే పనులు అయ్యాయని ఈ ప్రభుత్వంలో మళ్లీ మొదటి నుంచి పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు ఇరిగేషన్ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. గురువారం శాసనమండలి సమావేశాల్లో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు స్థల వివాదం వస్తుందని, దీనిపైన సంబంధిత మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టి పెట్టాలని కోరారు. లేకుంటే నగర పంచాయతీకి ఇదో పెద్ద సమస్య అవుతుందన్నారు.

ఉపాధి పనులపై దర్యాప్తు చేపట్టండి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని పిఆర్ రాజుపేటలో గత ఏడాది నరసింహ చెరువులో ఉపాధి పనులు జరిగాయని, అందులో అక్రమాలు జరిగాయని, దీనిపై వెంటనే దర్యాప్తు చేపట్టాలని అభ్యుదయ రైతు కందాపు ప్రసాదరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రూ.40 లక్షలతో చెరువు పనులు చేపట్టినట్టు చెబుతున్నా ఎక్కడా జరగలేదని, పేరుకే మస్తరు వేసుకుని కొంతమంది నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఎంతో ఉపయోగకరమైన ఈ చెరువు పనులు జరిగితే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ పనులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు.

కోసంగిలో పందిరి కూరగాయలు పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కోసంగిలో హార్టికల్చర్ ద్వారా నిర్వహిస్తున్న పందిరి కూరగాయలను డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ అధికారి శ్యామల గురువారం పరిశీలించారు. ఆదే గ్రామానికి చెందిన మధుసూదన్ రావు అనే రైతు 50 సెంట్లు పందిరి కూరగాయలు వేయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సేంద్రియ సాగు చేయడం ఆరోగ్యమని చెప్పారు. జీడితోటలో అంతర పంటలు వేయాలని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జీడి అంట్లు కట్టడంపై శిక్షణ ఇస్తామన్నారు. పందిరి కూరగాయలు పెంపకంపై ఆసక్తి చూపాలన్నారు. దీనివల్ల మంచి లాభాలు వస్తాయని చెప్పారు. కావున ఎక్కువగా సాగు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఒ పి.జయశ్రీ తదితరులు ఉన్నారు.

కాలువల్లో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కాలువల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వట్టిగెడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటర్ల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా జీవీఎం రూ.5.5 కోట్లతో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు కూడా నిర్మించారు. ఐటిడిఎ పర్యవేక్షణలో పనులు జరిగాయి. అయితే గుత్తేదారు మిత్ర జంక్షన్, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్వామి థియేటర్ వద్ద గల ప్రాంతాల్లో కాలువపై పలకలు అమర్చకపోవడంతో వాడుక చెత్తంతా కాలువలో పడిపోతుంది. రహదారి పనులు పూర్తి చేసిన రహదారికి ఇరువైపులా కాలువలో చెత్త తొలగించకుండా అలాగే విడిచిపెట్టడంతో కాలువ నుంచి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. 20 రోజుల కిందట మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి ఒకసారి కాలువలో పూడికలు తొలగించారు. రహదారి నిర్మాణ పనులు చేపట్టిన వారే వీటిని తొలగించి పూర్తిస్థాయిలో పలకలు అమర్చాల్సి ఉన్నప్పటికీ ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పూడికలు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులను బతకనివ్వరా?

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏజెన్సీలో గిరిజనులను సక్రమ జీవనం సాగించకుండా టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ గిరిజనులకు బతుకు తెరువు కోసం పోడు పట్టాలిచ్చిన ఐదేకరాలకొండను మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. సీతానగరం మండలంలోని అప్పయ్యపేట గిరిజనులకు జీవనోపాధి కోసం పోడు పట్టాలిచ్చిన భూముల్లో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజనులు ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. గిరిజన వ్యతిరేక విధానాలు విడనాడాలని రంజిత్ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

పోషణ-బి, పడాయి బి కార్యక్రమంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం అంగన్వాడీ వర్కర్లకు సిడిపిఒ కె.విజయగౌరి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు ఈనెల 20 నుంచి 22 వరకు బాలికల విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యత, అంగన్వాడీ కేంద్రాల్లో చేయాల్సిన కార్యక్రమాలపై, బాలిక విద్య, ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం వీరు నేర్చుకున్నది కేంద్రాల్లో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భవాని, జానకి, గౌరి, శ్రావణి, భాగ్యలక్ష్మి, చక్రధర్, శ్రీనివాస్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : కేంద్ర ప్రభుత్వం అమలు చేయిస్తున్న పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమంపై అవగాహన అవసరమని సిడిపిఒ జి.సుగుణ కుమారి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశాన్ని సుగుణ కుమారి వివరించారు. పోషణ్ బీ, పడాయి బీ అనేది బాల్య సంరక్షణ, విద్యపై దృష్టి సారించే ఒక కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమని అన్నారు. ఇది అంగన్‌వాడీల్లో అమలు చేయబడుతుందన్నారు. ప్రతి చిన్నారికి ప్రతిరోజూ కనీసం రెండు గంటల అధిక-నాణ్యత గల ప్రీ-స్కూల్ బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం బాల్య సంరక్షణ, విద్యపై దృష్టి సారించడం ద్వారా పిల్లల భవిష్యత్తుకు ఒక మంచి పునాది వేయడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సూపర్వైజర్లు శారదంబ, అరుణ, లక్ష్మి, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్వతీపురం: శిక్షణలో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు

పార్వతీపురం రూరల్ : చిన్నారులకు సరైన పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు ప్రాథమిక విద్యను కూడా నేర్పే కేంద్రాలుగా అంగన్వాడీ సెంటర్లను తీర్చిదిద్దడమే పోషణ్ బి, పడాయి బి ముఖ్యోద్దేశమని పార్వతీపురం సిపిడిపిఒ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఈ పథకంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో శిశువులకు ప్రాథమిక విద్య మాతృభాషలో బోధించేలా దృశ్య, శ్రవణ విధానంలో జరిగే ఈ మూడు రోజుల శిక్షణ తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : అంగన్వాడీ కేంద్రాల్లో మూడేళ్ల పిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ బి, పడాయి బి శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. పిల్లలకు విద్యతో పాటు ఆట, పాటలు కూడా నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎన్.రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ శాంతి భవాని ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బందికి పోషణ బి, పడాయి బి శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులను ఈనెల 22 వరకు నిర్వహిస్తున్నామని సిడిపిఒ తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో బిడ్డ పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకు సమగ్ర అభివృద్ధి చెందాలంటే, ఏం చేయాలి, ఏ డెవలప్మెంట్ అంశాలు సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తాయన్న అంశాలు వివరిస్తామని తెలిపారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు పిల్లల సమగ్ర అభివృద్ధికి చేయాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, శిక్షణ అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, క్షేత్రస్థాయిలో వీటిని ఇంప్లిమెంటేషన్ చేసి పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదం చేయాలని ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జ్యోతిలక్ష్మి, సబిత పట్నాయక్, కెజిబివి ఎస్ఒ భాగ్యవతి ఉన్నారు.



బామిని: మాట్లాడుతున్న సిడిపిఒ శాంతి భవాని

సీతంపేట : స్థానిక కెజిబివి పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బి, పడాయి బిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సిడిపిఒ పి.రంగలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారంతో పాటు చదువు ఉండాలని చెప్పారు. ఈ శిక్షణ వినియోగించుకొని గ్రామాల్లో తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం పోషణకు చదువుకు ఎంతో ఖర్చు చేస్తుందన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణ 2021-22 మూడు రోజుల పాటు ఉంటుందని తెలిపారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణా కార్యక్రమంలో సూపర్వైజర్లు మిస్సమ్మ, గౌరీ, బేగం, లావణ్య టెక్నికల్ అధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ డీలర్‌పై చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో గల భారత్ గ్యాస్ డీలర్‌పై చర్యలు చేపట్టాలని, వినియోగదారుల ఇక్కట్లు తీర్చాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీశంకర్రావు, జిల్లా నాయకులు కోలా కిరణ్ తదితరులు డిఆర్ఒ కె.హేమలతతో గురువారం భారత్ గ్యాస్ బాధితుల సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం సారికివీధిలో గల భారత్ గ్యాస్ కార్యాలయం సుమారు 25 రోజులుగా తెరవకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత మూడు వారాలుగా దాదాపు 800 మంది వినియోగదారులు గ్యాస్ కావాలని ఇండెంట్ పెట్టుకున్నప్పటికీ వారికి గ్యాస్ సరఫరా కాలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. నిత్యవసరమైన గ్యాస్ సరఫరా లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గెడ్డతిరువాడ, చినబొండపల్లి, వల్లరి గుడబ, కందివలస తదితర ప్రాంతాలకు చెందిన వినియోగదారులు రోజు ఖాళీ గ్యాస్ బండలతో కార్యాలయానికి రావడం, కార్యాలయం మూసి ఉండడంతో నిరాశతో ఎదురు తిరుగుతున్నారని, కనీసం సమాధానం చెప్పడానికి కార్యాలయ సిబ్బంది, ప్రతినిధులు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇండెంట్ పెట్టిన వెంటనే గ్యాస్ డోర్ డెలివరీ చేయాల్సిన భారత్ గ్యాస్ గత మూడు వారాలుగా డెలివరీ చేయకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. దీంతో బయట అధిక మొత్తం చెల్లించి గ్యాస్ కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారన్నారు. భారత్ గ్యాస్ వినియోగదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

అంతర పంటలతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ఉద్యాన శాఖధికారి బి.ఝాన్సీ రాణి అన్నారు. ఉద్యానవన పంటలను సాగు చేసే రైతులు అంతర్ పంటలు వేయడం వల్ల అదనపు ఆదాయం పొందుతారని దీని ద్వారా భూమికి కూడా సారవంతమైన ఎరువులు, నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. గురువారం మండలంలోని గంగన్నదొరవలస గ్రామంలో ఉద్యానవన రైతులతో కోకో సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామాయిలు, కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేయడం వల్ల రైతులు ఇతర పంటల సాగు కంటే అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని, కోకోలో అధిక దిగుబడులకు కోకో పంటను కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించుకొని ఎరువులను సరైన పద్ధతుల్లో వేసుకోవడం వల్ల అవి కూడా ప్రధాన పంట వలె అధిక ఆదాయం ఇస్తాయని అన్నారు. వీటి ద్వారా ప్రధాన పంటైన పామాయిల్ కొబ్బరి తోటలలో కలుపును నివారించవచ్చుననాన్నరు. కొత్తగా పామాయిల్ కోకో పంటలను వేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని పామాయిల్ వేసుకునే రైతులకు ఒక్కొక్క దేశవాలి మొక్కకు 133 రూపాయిలు, హైబ్రిడ్ మొక్కనకు 193 చొప్పున ఒక ఎకరానికి 57 మొక్కలు అందజేస్తున్నామని చెప్పారు. మొక్కను నాటిన మొదటి, రెండవ మూడవ నాలుగు సంవత్సరాలు దాని ఎరువులు యాజమాన్య పద్ధతుల కోసం ఒక్కొక సంవత్సరానికి 2,100 చొప్పున అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్యాడబరి ప్లాంటేషన్ మేనేజర్ అశోక్ కుమార్, తోనాం, మరిపల్లి పామాయిల్ కోకో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట పంచాయతీలలో బదలాయింపు చట్టం 1/70 అమలలో ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ, గ్రామ కంఠం భూములను కొంత మంది గిరిజనేతరులు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు తహశీల్దార్ ఎన్.శేఖర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు జరిపించి అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగించాలని కోరారు. తహశీల్దార్ సానుకూలంగా స్పందించి అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు ఆరిక చంద్రశేఖర్, ఐ.రామకృష్ణ, లోవరాజు, సీతారాం, తిరుపతి రావు పాల్గొన్నారు.

జీడి పిక్కలు పరిశ్రమను గిరిజన ప్రాంతంలోనే పెట్టాలి

పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యంలో జీడి పిక్కల పరిశ్రమను గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని చేస్తున్న ఆలోచన సరైనది కాదన్నారు. మన్యం జిల్లాలో సుమారుగా 64 వేల ఎకరాలు జీడి తోటలు ఉన్నప్పటికీ కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యంవలస, కొమరాడ మండలాల్లో సుమారుగా 56 వేల ఎకరాలు జీడి తోటలు గిరిజనులు ఆధ్వ ర్యంలో సాగులో ఉన్నాయని జీడి ప్రాసెసింగ్ యూ నిట్లు ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే గిరిజనులకు సరైన గిట్టుబాటు ధర వస్తుందని చెప్పారు.



తహశీల్దార్‌కు వినతినిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

పెద్దూరును పంచాయతీగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని, మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరు గ్రామానికి చెందిన నిమ్మక నగేష్, ఆరిక లక్కయ్య, లక్ష్మీ, అప్పమ్మ, జానకి, బిడ్డిక ఎండయ్య, గుండయ్య, లలిత, బాబురావు తదితర గిరిజనులు డిమాండ్ చేశారు. వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్యపువలస, చలివేంద్రి పంచాయతీ పరిధిలో సవర గోపాలపురం కాలనీ, దశమంతపురం పంచాయతీ పరిధిలో పెద్దూరు, సింధునగర్ గిరిజన గ్రామాలను కలిపి పెద్దూరు పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. నాలుగు గ్రామాల్లో 900 మంది జనాభా, 750 మంది ఓటర్లు ఉన్నట్లు వారు తెలిపారు. దశమంతపురం సచివాలయానికి వెళ్లాలంటే వేరే మార్గాలు లేక వీరఘట్టం గ్రామానికి చేరుకొని చలివేంద్రి గ్రామం మీదుగా దశమంతపురం చేరుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సంబంధించి ఏ రకమైన ధ్రువపత్రాలు తోపాటు రేషన్‌కు కూడా అక్కడికి వెళ్లే తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, గిరిజనులు వాపోతున్నారు. పెద్దూరు గిరిజన గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని, సీతంపేట ఐటిడిఎలో జరిగిన దర్బార్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే కళావతి, ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నాలుగు గ్రామాలు ఒకే చోట ఉన్నందున పెద్దూరు గిరిజన గ్రామాన్ని పంచాయతీగా చేయాలని, గిరిజనులు కోరుతున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని అరసాడలో డాక్టర్ నాయుడు ప్లాజా, ఎన్నారై ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎన్నారై ఆసుపత్రి వైద్యులు గైనిక్, జనరల్, వ్యాధిగ్రస్తులకు సంబంధించి 178 మంది రోగులకు ఉచిత తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సిబిరంలో ప్రత్యేకంగా ఆర్థోపెడిక్ సంబంధించి తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.



బలిజిపేట: వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సింహాచలం నాయుడు, కె.పాపి నాయుడు, ఎం. చనమనాయుడు, గౌరీశ్వరరావు, జి.బాబ్జి, కే. సింహాచలంనాయుడు, వి.జగదీశ్వరరావు, జి.పోలురాజు తదితరులు పాల్గొన్నారు.

విక్రంపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని చిట్టిపూడివలస సచివాలయం పరిధి విక్రంపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహం, రక్తపోటు తదితర రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రూ.లక్షన్నర ఖర్చుపెట్టినా కదలని వాహనం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ప్రజారోగ్య విభాగానికి చెందిన హైడ్రాలిక్ చెత్త తరలింపు చేసే వాహనం కొన్ని నెలల క్రితం మరమ్మత్తుకు గురైంది. ఈ వాహనాన్ని విశాఖకు చెందిన ఒక ప్రైవేట్ మెకానిక్ షాపునకు మరమ్మతుల నిమిత్తం పంపి రూ.1,55,878 ఖర్చు చేసి బాగు చేయించారు. దీనికి సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లు చెల్లించి విశాఖ నుండి మున్సిపల్ కార్యాలయానికి తీసుకువచ్చిన కొన్ని రోజులకే ఆ వాహనాన్ని బయటకు తీసుకు వచ్చే క్రమంలో మొరాయించడంతో, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రజారోగ్య విభాగం అధికారులు తోపాటు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టు మరమ్మత్తులకు చేసినప్పటికీ వాహనం మొ రాయించడం ఏమిటో అని అసహనానికి గురువుతూ మూలకు చేర్చారు. దీంతో చెత్త, వ్యర్థాలు తరలింపునకు పారిశుధ్య కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన ఈ వాహనానికి మరమ్మత్తులు చేసి వాడుకలోకి తీసుకు రావాల్సిన అవసరం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ప్రజారోగ్య అధికారులకు ఎంతైనా ఉందని కార్మికులు చెబుతున్నారు.



మొరాయిస్తున్న వాహనం ఇదే..

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గల దంత వైద్యాధికారి డాక్టర్ సుకృత ఆధ్వర్యంలో నోటి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి ఆస్పత్రి నుంచి సంత రోడ్డు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు, ప్రజలకు నోటి ఆరోగ్యం, ప్రాముఖ్యతను వివరించారు. నోరు పరిశుభ్రంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరిం టెండెంట్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ సందీప్, డాక్టర్ ఆశా కృష్ణన్, డాక్టర్ సునీల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని అరసాడలో టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు గురువారం ఎట్టకేలకు కాలువ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే తన మాట నిలబెట్టుకున్నారన్నారు. సీసీ రోడ్డు, కాలువ పనులను సుమారు రూ.8 లక్షలతో నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూస్తామన్నారు. సక్రమంగా వాడుక నీరు గ్రామం బయటికి వెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జి సింహాచలం నాయుడు, ఎం చిన్నంనాయుడు, మండల సీనియర్ నాయకులు కె.సింహా సాయినాయుడు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

నేలబావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణానికి చెందిన మజ్జి సత్యనారాయణ (54) మండలంలోని నర్సిపురం శివారు విజయా బ్యాంకు వెనుక ఉన్న నేల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గురువారం పోలీసులు తెలిపారు. రూరల్ ఎస్సై సంతోషికుమారి అందించిన వివరాలు ప్రకారం పట్టణంలోని సారిక వీధికి చెందిన మజ్జి సత్యనారాయణ తన భార్య పార్వతికి రెండు రోజుల క్రితం డాక్టర్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన తన భర్త ఎంతకూ ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల బంధుమిత్రులతో కలిసి గాలించానని తెలిపారు. గురువారం ఉదయం నేల బావిలో శవంగా కనిపించారని అన్నారు. తన సోదరుడు సుంకరి నాగభూషణరావు ఇటీవల మృతి చెందారని, అప్పటి నుండి తన భర్త తీవ్రమనస్థాపానికి లోనయ్యారని, ఆ పరిస్థితుల్లోనే ఈ ఘటనకు పాల్పడినట్లు తాము భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కొడుకు, కుమార్తె ఉఆన్నరు. కుమార్తెకు ఇటీవల వివాహమైంది. సత్యనారాయణ భార్య పార్వతీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై తెలిపారు.

చినబొండపల్లిలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని చినబొండపల్లి శివారులో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. సకాలంలో స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తం కావడంతో భారీ ఆస్తి నష్టం తప్పింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి గ్రామంలోని ధాన్యం కల్లాలు పక్కనే ఉన్న మామిడి తోటలో ఆకతాయిలు సిగరెట్టు తాగి ఎండిన ఆకులపై పడవేయడంతో మంటలు విస్తరించాయి. కొద్ది దూరంలోనే వరి ధాన్యం కుప్పలతో పాటు, వంట చెరుకు నిల్వ చేసి ఉండడంతో వాటికి కూడా మంటలు అంటుకుంటాయేమోనని గ్రామస్తులు ఆందోళన చెందారు. అయితే అగ్నిమాపక సిబ్బంది సరైన సమయంలో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంలో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం డోకిశిల పంచాయితీ శివారు తోటల్లో జరిగింది. పామాయిల్ తోట నిర్వహణ పనులను పర్యవేక్షిస్తున్న సందీప్ భార్య లీలా సత్యశ్రీ (35) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలియజేశారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.